
సాక్షి
పశ్చిమగోదావరి
సోమవారం ၊ 25 ၊ మార్చి ၊ 2024



కాక పుట్టిస్తున్న పామాయిల్
పామాయిల్ ధర కాక రేపుతోంది. కరోనా సమయంలో మాదిరిగా ధర పెరిగి ప్రస్తుతం చుక్కలు చూపుతోంది.
8లో ▸



ముగిసిన టెన్నిస్ టోర్నీ
భీమవరం కాస్మోపాలిటన్ క్లబ్‌లో ఆల్ ఇండియా సీనియర్ ర్యాంకింగ్ టెన్నిస్ టోర్నమెంట్ పోటీలు ముగిశాయి.
8లో ▸



న్యూస్‌రీల్

ప్రజాసేవ కోసమే వైఎస్సార్‌సీపీ పుట్టింది



భీమవరంలో ఎన్నికల ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్

భీమవరం (ప్రకాశంచౌక్): ప్రజలకు సేవ చేయడం కోసమే వైఎస్సార్‌సీపీ పుట్టిందని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ అన్నారు. పట్టణంలోని 20వ వార్డులో ఆదివారం రాత్రి ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2019 ఎన్నికల్లో సీఎం జగన్ ఇచ్చిన ప్రతి హామీని అమలు చేశారని, ప్రజల్లోకి వెళ్లి ఓటు అడిగే హక్కు వైఎస్సార్‌సీపీకి మాత్రమే ఉందన్నారు. నవరత్నాల పేరుతో ప్రతి కుటుంబానికీ ఆర్థిక భరోసా కల్పించారన్నారు. భీమవరం నియోజకవర్గాన్ని అభివృద్ధి బాటలో నడిపామని, ప్రతి గ్రామంలో, ప్రతి వార్డులో తమ ప్రభుత్వం చేసిన అభివృద్ధి స్పష్టంగా కనిపిస్తుందని అన్నారు. అభివృద్ధిని మాటల్లో కాకుండా చేతల్లో చూపించామన్నారు. నీతివంతమైన పాలనను అందించి ప్రజల మనసుల్లో సీఎం జగన్ చిరస్థాయిగా నిలిచారన్నారు. సంక్షేమ పథకాలు భవిష్యత్‌లోనూ కొనసాగాలంటే మరోసారి ముఖ్యమంత్రిగా జగన్ కావాలన్నారు. భీమవరం నియోజకవర్గంలో మరిన్ని అభివృద్ధి పనులు శాశ్వత ప్రాతిపదికన జరిగేలా పనిచేస్తున్న తనను ఓట్లు వేసి గెలిపించాలని కోరారు. భోగిరెడ్డి హనుమాన్, మెంటే బలరాం, కామన నాగేశ్వరరావు, కొల్లి ప్రసాద్, ముత్యాల రామారావు తదితరులు పాల్గొన్నారు.


ప్రచారాల్లో ఉద్యోగులు పాల్గొంటే చర్యలు



సుమిత్‌కుమార్, కలెక్టర్

భీమవరం (ప్రకాశంచౌక్): రాజకీయ పార్టీల ప్రచార కార్యక్రమాల్లో ప్రభుత్వ ఉద్యోగుల ప్రమేయం ఉండరాదని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదివారం ప్రకటనలో తెలిపారు. ఎన్నికల నియమావళి అమలుపై ప్రత్యేక దృష్టి సారించామని, ప్రభుత్వ ఉద్యోగులు అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రచారాల్లో ఉద్యోగులు పాల్గొన్నట్టు ఫిర్యాదులు వస్తే తక్షణమే సస్పెండ్ చేస్తామని హెచ్చరించారు. జిల్లాలో ఓటర్ల చైతన్యం కోసం స్వీప్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, ప్రతి నియోజకవర్గంలో తక్కువగా పోలింగ్ శాతం నమోదైన 10 పోలింగ్ స్టేషన్లను గుర్తించి పోలింగ్ శాతం పెంచేందుకు ప్రణాళిక రూపొందించామన్నారు. జిల్లా కేంద్రం, ప్రతి నియోజకవర్గంలో ఆర్‌ఓల హెడ్ క్వార్టర్‌లో కమాండ్ కంట్రోల్ రూమ్‌లు 24 గంటలు పనిచేస్తాయన్నారు. సీ-విజిల్ ఫిర్యాదులు 100 నిమిషాల్లో పరిష్కరిస్తామన్నారు. వలంటీర్లు కూడా రాజకీయ కార్యక్రమాల్లో పాల్గొనరాదన్నారు. సరిహద్దు ప్రాంతాల్లో చెక్‌పోస్టులను ఏర్పాటు చేశామన్నారు. వెబ్ కెమెరాలను ఏర్పాటుచేసి జిల్లా కమాండ్ కంట్రోల్ రూమ్ నుంచి మోనిటర్ చేసేలా ఏర్పాట్లు చేశామన్నారు. జిల్లాలో ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించేలా చర్యలు తీసుకున్నామని కలెక్టర్ తెలిపారు.

వైఎస్సార్‌సీపీలోనే బీసీలకు సముచిత స్థానం



గొర్రుముచ్చు గోపాల్ యాదవ్

కామవరపుకోట: వైఎస్సార్‌సీపీలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బీసీలకు సముచిత స్థానం కల్పించి పెద్దపీట వేశారని ఏలూరు ఎంపీ స్థానాన్ని ఆశించిన తెలుగుదేశం పార్టీ అభ్యర్థి గొర్రుముచ్చు గోపాల్ యాదవ్ అన్నారు. ఆదివారం మండలంలో కంటమనేనివారిగూడెంలోని తన నివాసంలో విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో బీసీలు అంటే టీడీపీలోని మాజీ మంత్రి యనమల రామకృష్ణుడు ఒక్కడే కాదని బీసీల్లో పలు ఉపకులాలు ఉన్నాయన్నారు. అన్ని కులాలకు చెందిన నాయకులను వదలి యనమల రామకృష్ణుడు కుటుంబసభ్యులనే బీసీలుగా గుర్తించి, వారికే లబ్ధి చేకూర్చేలా టీడీపీ అధిష్టానం సీటు కేటాయించడం సరికాదన్నారు. స్వార్థ రాజకీయ ప్రయోజనాలతో యనమల రామకృష్ణుడు తనను పావుగా వాడుకున్నారని మండిపడ్డారు. రాష్ట్రంలో అధిక సంఖ్యలో ఉన్న బీసీలను గుర్తించి సీఎం జగన్ 19 ఎంపీ స్థానాల్లో 11 స్థానాలను కేటాయించి అధిక ప్రాధాన్యమిచ్చారన్నారు. సీఎం జగన్ ధైర్యాన్ని మెచ్చుకోవాలన్నారు. టీడీపీ అధిష్టానం విదేశాల్లో వ్యాపారం చేసుకుంటున్న తనను తీసుకొచ్చి, ఏలూరు ఎంపీ స్థానానికి అవకాశం కల్పిస్తానని చెప్పి వాడుకున్నారని కన్నీటి పర్యంతమయ్యారు. టీడీపీలో బీసీలకు గుర్తింపు లేదన్నారు. వచ్చే నాలుగు రోజుల్లో రాజకీయాలపై కార్యాచరణ ప్రకటిస్తానని చెప్పారు.

గడప చెంతకు పాలన

ప్రజల వద్దకు పాలనకు కార్యరూపం ఇచ్చారు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి. ఇంటికే పింఛన్, గడప గడపకు మన ప్రభుత్వం, జగనన్న సురక్ష, జగనన్న ఆరోగ్య సురక్ష.. ఇలా కార్యక్రమం ఏదైనా ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ యంత్రాంగాన్ని ప్రజలకు చేరువ చేశారు. గతంలో కాళ్లరిగేలా కార్యాలయాల చుట్టూ తిరిగినా కాని పనులు ఇప్పుడు చెంతకే వస్తుండటంతో ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. సార్వత్రిక ఎన్నికల వేళ ప్రచారం నిర్వహిస్తున్న వైఎస్సార్‌సీపీ అభ్యర్థులకు నీరాజనాలు పడుతున్నారు.

జనహితం.. సంక్షేమ పథం
- పేదింటి తలుపు తట్టిన జగన్ ప్రభుత్వం
- ఐదేళ్లుగా ప్రజల్లోనే ప్రజాప్రతినిధులు
- 'గడపగడపకు' కార్యక్రమంతో సమస్యల పరిష్కారం
- ఎన్నికల ప్రచారం ద్వారా మరోమారు జనంలోకి..
- అడుగడుగునా నీరాజనాలు



ఆచంట మండలం కొడమంచిలిలో మాజీ మంత్రి చెరుకువాడ శ్రీరంగనాథరాజు ఎన్నికల ప్రచారం (ఫైల్)

సాక్షి, భీమవరం: గత టీడీపీ ప్రభుత్వంలో పేదలకు ఏ పథకం అందాలన్న జన్మభూమి కమిటీలను ప్రసన్నం చేసుకోవాల్సిన దుస్థితి. ఏ సర్టిఫికెట్ కావాలన్నా రోజుల తరబడి కార్యాలయాల చుట్టూ తిరగాల్సిందే. ఎమ్మెల్యేలు, మంత్రులను కలవడమంటే సామాన్యులకు గగనంగా ఉండేది. పింఛన్ల కోసం వృద్ధులు, దివ్యాంగుల అవస్థలు వర్ణనాతీతం.

సచివాలయం.. సేవా నిలయం
వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం దేశంలో ఎక్కడా లేనివిధంగా సచివాలయం, వలంటీర్ వ్యవస్థలు తీసుకురావడం ద్వారా సరికొత్త పాలనకు శ్రీకారం చుట్టింది. జిల్లాలో 535 సచివాలయాలు ఏర్పాటుచేసి 35 ప్రభుత్వ శాఖలకు చెందిన 500 సేవలు స్థానికంగానే అందిస్తోంది. జిల్లావ్యాప్తంగా 8,900 మంది వలంటీర్లు ప్రతినెల 1న వేకువజామునే 2.36 లక్షల మంది లబ్ధిదారుల ఇంటికి వెళ్లి రూ.69.74 కోట్లు పింఛన్ సాయం అందిస్తున్నారు. ప్రభుత్వ పథకాల కోసం అర్హులైన వారు ఎక్కడికి తిరగాల్సిన పనిలేకుండా వలంటీర్లే ఇంటికి వచ్చి దరఖాస్తులు చేయిస్తున్నారు.

అపూర్వ స్పందన : ప్రభుత్వం ప్రజలకు పాలనను చేరువ చేయడంతో వైఎస్సార్‌సీపీ అభ్యర్థుల ఎన్నికల ప్రచారానికి ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారు. జిల్లాలో ఇప్పటికే నరసాపురం లోక్‌సభ నియోజకవర్గ అభ్యర్థి గూడూరి ఉమాబాల, తణుకులో మంత్రి కారుమూరి వెంకటనాగేశ్వరరావు, తాడేపల్లిగూడెంలో మంత్రి కొట్టు సత్యనారాయణ, ఆచంటలో ఎమ్మెల్యే చెరుకువాడ శ్రీరంగనాథరాజు, భీమవరంలో విప్, ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్, నరసాపురంలో చీఫ్ విప్, ఎమ్మెల్యే ముదునూరి ప్రసాదరాజు, ఉండిలో అభ్యర్థి పీవీఎల్ నరసింహరాజు, పాలకొల్లులో అభ్యర్థి గుడాల శ్రీహరిగోపాలరావు (గోపి) ప్రచారం చేపట్టారు. వీరికి ప్రజలు అపూర్వ స్వాగతం పలుకుతున్నారు.

పేదల ఆరోగ్యానికి సురక్ష
జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా ప్రతి ఇంటిని జల్లెడపట్టి అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న వారిని గుర్తించారు. 264 మంది స్పెషలిస్ట్ వైద్యులు, 132 మంది మెడికల్ ఆఫీసర్లు, ఇతర ఆరోగ్య సిబ్బంది 3.46 లక్షల మందికి అవసరమైన వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు.

సులభంగా సర్టిఫికెట్లు
ధ్రువీకరణ పత్రాల కోసం ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పనిలేకుండా జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు జిల్లాలోని 6.45 లక్షల కుటుంబాలను సర్వే చేసి వారి అవసరాలను గుర్తించారు. 6,05,780 మంది లబ్ధిదారులకు ఎలాంటి సర్వీస్ చార్జీ లేకుండానే జనన, మరణ, ఆదాయ, కులం తదితర 6,48,607 సర్టిఫికెట్లు జారీ చేశారు.

గడపగడపకుతో సత్వర పరిష్కారం
గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా మంత్రులు, ఎమ్మెల్యేలు ప్రతి ఇంటికీ వచ్చి ప్రజల సమస్యలు తెలుసుకుని సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకున్నారు. ఇలా రోడ్లు, డ్రెయిన్లు, తాగునీరు, విద్యుత్ తదితర రూ.83 కోట్ల విలువైన 1,836 పనులు గుర్తించారు. వీటిలో ఇప్పటికే 600 పనులు పూర్తికాగా మిగిలినవి వివిధ దశల్లో ఉన్నాయి.

పథకాలపై బెంగ లేదు



సీఎం జగన్ పాలన పేదల జీవితాల్లో వెలుగులు నింపింది. సమయానికి పింఛన్, సంక్షేమ పథకాలు అందుతున్నాయి. రాజకీయాలకు అతీతంగా ఇంటి స్థలాలు అందించడం అద్భుతం. పథకాలు మాకు ఇస్తారో ఇవ్వరో అనే బెంగ లేకుండా ప్రజలు సంతోషంగా ఉన్నారు.
– జి.అమృతరావు, ప్రైవేట్ బస్సు డ్రైవర్, ఉండి

మహిళలకు ఆర్థిక స్వేచ్ఛ



సీఎం జగన్ మహిళలకు ఆర్థిక స్వేచ్ఛ కల్పించారు. స్థలం, ఇంటి రుణాలు మహిళల పేరిట ఇవ్వడంతో వారికి గౌరవం పెరిగింది. అమ్మఒడి, ఆసరా, చేయూత తదితర పథకాలు మహిళలు ఆర్థికంగా బలపడేందుకు దోహదపడుతున్నాయి.
– పెరుమాళ్ల శివకుమారి, మందపాడు, ఆకివీడు మండలం

ఇంటికే వచ్చి పరిష్కరిస్తూ..



నాయకులు, అధికారులను ప్రజల కోసం పనిచేసేలా వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వం చేసింది. మంత్రి, ఎమ్మెల్యే స్థాయి నాయకులు ఇంటింటికీ వచ్చి ప్రజాసమస్యలు తెలుసుకుని పరిష్కరిస్తుండటం చాలా గొప్ప విషయంగా చెప్పవచ్చు.
– చిలకపాటి బాబి, ట్యాక్సీ డ్రైవర్, బొండాడ

ప్రజలకు అందుబాటులో..



ప్రభుత్వ కార్యక్రమాల ద్వారా నాయకులు, అధికారులు తరచూ ప్రజల వద్దకు వస్తున్నారు. దీంతో పేదలు తమ సమస్యలను చెప్పుకుంటున్నారు. చాలా సమస్యలను నాయకులు, అధికారులు కలిసి అక్కడికక్కడే పరిష్కరించేందుకు చొరవ చూపుతున్నారు.
– నేతల జ్ఞానసుందర్రాజు, రిటైర్డ్ ఆర్టీఓ, వీరవాసరం

జగన్ పాలనే కోరుకుంటున్నాం



నేను 15 ఏళ్లుగా దుబాయ్‌లో ఉంటున్నాను. ఈ ఐదేళ్లలో సీఎం జగన్ పాలన చాలా బాగుంది. ముఖ్యంగా పాఠశాలలు, ఆస్పత్రులు అభివృద్ధి చేశారు. ప్రభుత్వ వైద్యులను ఇంటికి పంపించి వైద్యసాయం అందిస్తున్నారు. ప్రతి ఇంటికీ సంక్షేమం చేరింది.
– ఇంజేటి బాబు, కొత్తపేట, పాలకొల్లు మండలం

ప్రజలకు ఎంతో మేలు



ఈ ప్రభుత్వంలోని సంక్షేమ పథకాలు మునుపెన్నడూ చూడలేదు. సచివాలయ, వలంటీర్ వ్యవస్థలతో యువతకు ఉద్యోగావకాశాలతో పాటు ఇంటి వద్దకే పథకాలు అందుతున్నాయి. నియోజకవర్గ, గ్రామస్థాయి నేతలు నిత్యం ప్రజల్లో ఉండటం శుభపరిణామం.
– మామిడిశెట్టి శ్రీనివాసరావు, వ్యాపారి, వేములదీవి వెస్ట్

రాష్ట్రంలో ప్రజారంజక పాలన



ఎన్నికల ప్రచారంలో పార్టీ స్టిక్కర్‌లు అంటిస్తున్న మంత్రి కారుమూరి నాగేశ్వరరావు

తణుకు అర్బన్: మీకు మంచి జరిగితేనే నాకు అండగా ఉండండి అని ఎన్నికలకు వెళ్తున్న ఒకే ఒక్క నాయకుడిగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చరిత్రలో నిలుస్తారని పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. ఆదివారం తణుకు 3వ వార్డులోని కొండాలమ్మ తల్లి ఆలయంలో మంత్రి కారుమూరి కొబ్బరికాయ కొట్టి ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2019 ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను 99.5 శాతం అమలుచేసి, నవరత్నాల రూపంలో సంక్షేమాన్ని ప్రజలకు అందించి ఎన్నికలకు వెళ్తున్నామన్నారు. 14 ఏళ్ల పాలనలో ప్రజలకు ఏం చేశారని చెప్పి చంద్రబాబు ఓట్లడుగుతారని ఎద్దేవా చేశారు. సీఎం జగన్ ప్రజారంజక పాలన అందించారని, ప్రజలంతా మరోమారు ఆశీర్వదించేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. అమ్మఒడి పథకంతో పేద బిడ్డల చదువులకు సీఎం జగన్ సాయం చేస్తున్నారన్నారు. 58 నెలల కాలంలో రుణమాఫీలు, ఆర్‌బీకే, సచివాలయాల భవన నిర్మాణాలు పూర్తయ్యాయని మరలా ముఖ్యమంత్రిగా జగన్ అయితేనే సంక్షేమం, అభివృద్ధి మరింత అధిక సంఖ్యలో అమలు చేస్తారని అన్నారు. చంద్రబాబు హయాంలో దేశంలో 16వ స్థానంలో ఉండే విద్యారంగం ఇప్పుడు 1వ స్థానంలో నిలిచిందంటే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ చిత్తశుద్ధి అర్థమవుతుందన్నారు. అనంతరం 3వ వార్డులో ఇంటింటికీ వెళ్లి మంత్రి కారుమూరి ప్రజలను కలిసి ఫ్యాన్ గుర్తుకు ఓట్లు వేయాలని అభ్యర్థించారు. ఇంటి గోడలపై జగన్ స్టిక్కర్లు అతికించారు. వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు మంగెన సూర్య, చోడే గోపి, కరుటూరి పాండురంగారావు, పిల్లి సూరిబాబు, సామంతుల అప్పారావు, కుడుపూడి చంద్రరావు, సుద్దుల పాండు తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమం



పేరుపాలెం సౌత్‌లో మహిళలకు పథకాల లబ్ధిని వివరిస్తున్న చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు

మొగల్తూరు: రాష్ట్రంలో కుల, మతాలకతీతంగా అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందించిన ఘనత సీఎం జగన్‌కు దక్కుతుందని చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు అన్నారు. శనివారం పేరుపాలెం సౌత్ పంచాయతీలో ఆశీర్వాద ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న ఆయన శనివారం రాత్రి గ్రామంలోనే బసచేశారు. ఆదివారం వేకువజాము నుంచి మధ్యాహ్నం వరకు గ్రామంలో పర్యటించి ప్రభుత్వ పథకాల లబ్ధిని వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిఒక్కరికీ లబ్ధి చేకూర్చడం ద్వారా ధైర్యంగా ఓట్లు అడగగలుగుతున్నామన్నారు. జగన్ మరోమారు ముఖ్యమంత్రి అయితేనే మరిన్ని పథకాలు అమలవుతాయన్నారు. తీర ప్రాంత గ్రామాల్లో రోడ్లు అభివృద్ధి చేశామని, రానున్న రోజుల్లో తాగునీటి సమస్య లేకుండా ప్రతి ఇంటికి కుళాయిలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. సర్పంచ్ తిరుమాని విజయలక్ష్మి, మున్సిపల్ చైర్‌పర్సన్ బర్రి వెంకటరమణ, వైఎస్సార్ సీపీ నాయకులు కర్రి ఏసుబాబు, ఓసూరి విజ్జిబాబు తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ సారథి సీఎం జగన్



ఓట్లు అభ్యర్థిస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి గుడాల గోపి

పాలకొల్లు అర్బన్: పేద, మధ్యతరగతి వర్గాల ఆర్థికాభ్యున్నతికి పలు సంక్షేమ పథకాలు అమలు చేసిన సీఎం జగన్‌కి అండగా నిలవాలని వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గుడాల శ్రీహరి గోపాలరావు (గోపి) కోరారు. పాలకొల్లులోని 4వ వార్డులో ఆదివారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. రానున్న రోజుల్లో మరింత సంక్షేమం అందాలంటే వైఎస్సార్ సీపీ అభ్యర్థులకు ఓట్లు వేసి గెలిపించాలన్నారు. నరసాపురం ఎంపీ అభ్యర్థి గూడూరి ఉమాబాల, ఎమ్మెల్యే అభ్యర్థినైన తనకు రెండు ఓట్లు ఫ్యాన్ గుర్తుకి వేసి ఆశీర్వదించాలని కోరారు.

ఎమ్మెల్యే నిమ్మలవి గారడీ మాటలు
పదేళ్ల నుంచి ప్రజల్ని మోసం చేస్తున్న ఎమ్మెల్యే నిమ్మల రామానాయుడు గారడీ మాటలు నమ్మవద్దని గుడాల గోపి అన్నారు. నియోజకవర్గ అభివృద్ధికి అడుగడుగునా అడ్డుపడుతున్న ఎమ్మెల్యేని ఇంటికి సాగనంపాలని పిలుపునిచ్చారు. టిడ్కో గృహాలు పేదలకు అందకుండా, ఇంటి స్థలాల పూడిక పనులు చేయకుండా అడ్డుపడుతున్న నిమ్మల అభివృద్ధికి అడ్డంకిగా మారారని మండిపడ్డారు. పాలకొల్లు ప్రజలు 30 ఏళ్ల నుంచి మురుగు సమస్యతో బాధ పడుతున్నారని, దీనికి శాశ్వత పరిష్కారం కోసం దమ్మయ్యపత్తి డ్రెయిన్ మరమ్మతులకు రూ.15 కోట్లు ప్రతిపాదనలు చేసి ప్రభుత్వానికి పంపించామన్నారు. డీసీఎంఎస్ మాజీ చైర్మన్ యడ్ల తాతాజీ, పట్టణ పార్టీ అధ్యక్షుడు చందక సత్తిబాబు, ఏఎంసీ మాజీ చైర్మన్ సాలా నరసయ్య, పార్టీ నాయకులు అడబాల వెంకటరమణ, 4వ వార్డు ఇన్‌చార్జ్ తలుపూరి భుజంగరావు, నాయకులు పాల్గొన్నారు.

క్షయ రహిత సమాజానికి కృషి

భీమవరం (ప్రకాశంచౌక్): క్షయరహిత సమాజ నిర్మాణానికి కలిసికట్టుగా కృషి చేయాలని డీఎంహెచ్‌ఓ డి.మహేశ్వరరావు అన్నారు. ఆదివారం ప్రపంచ క్షయవ్యాధి నివారణ దినోత్సవాన్ని స్థానిక ఏరియా ప్రభుత్వ హాస్పిటల్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ యన మాట్లాడుతూ క్షయ ప్రాణాంతక వ్యాధి అని, తొలిదశలో గుర్తించి చికిత్సలు, మందులు వాడితో నివారించవచ్చన్నారు. జిల్లా క్షయవ్యాధి నిర్మూలన అధికారి బి.భానునాయక్ మాట్లాడుతూ క్షయ నిర్మూలనకు ప్రభుత్వాలు పలు కార్యక్రమాలు అమలు చేస్తున్నాయన్నారు. జిల్లాలో 1,690 కేసులు గుర్తించి క్రమం తప్పకుండా ఉచితంగా వైద్యసే వ లు, మందులు అందిస్తున్నామన్నారు. క్షయ నిర్మూలనా కార్యక్రమాల్లో విస్తృత సేవలందించిన 20 మందికి ప్రశంసా పత్రాలు, జ్ఞాపికలను అందజేశారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ వి.మాధవీ కళ్యాణ్, వైద్యాధికారులు ఎస్.రంగారావు, జి.గోవిందబాబు తదితరులు పాల్గొన్నారు.

మళ్లీ మంత్రి కొట్టునే గెలిపించుకుంటాం

రజక సంఘ నాయకుల మద్దతు



రజక సంఘ భవనంలో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ

తాడేపల్లిగూడెం అర్బన్: సార్వత్రిక ఎన్నికల్లో మళ్లీ కొట్టు సత్యనారాయణను ఎమ్మెల్యేగా గెలిపించుకుంటామని రజక సంఘ నాయకులు అన్నారు. స్థానిక రజక సంఘ భవనంలో ఆదివారం ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘ నాయకులు మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వం రజకులకు వంచించిందని, సీఎం జగన్ సముచిత స్థానం కల్పించారని మళ్లీ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని నిలబెట్టుకుంటామని అన్నారు. ఆలిండియా దోబి మహాసంఘ్ కార్యదర్శి చింతాడ శ్రీనివాస్, రజక సంఘం అధ్యక్షుడు యండమూరి మహేష్, అడ్డాల నర్సింహరావు, కర్రి భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

బీసీలకు పెద్దపీట : స్థానిక మహాలక్ష్మీనగర్‌లో మంత్రి కొట్టు సత్యనారాయణ గౌడ సంఘం నాయకులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గౌడ నాయకులు మాట్లాడుతూ సీఎం జగన్ బడుగు, బలహీన వర్గాలకు ఉన్నత స్థానాన్ని కల్పించారని, అలాగే ఆలయ పాలక మండలి కమిటీల్లో పెద్దపీట వేసిన మంత్రి కొట్టును మళ్లీ ఎమ్మెల్యేగా గెలిపించుకుంటామని మద్దతు తెలిపారు. తాతా శ్రీనివాస్, కోట రాంబాబు, కొలుకులూరి ధర్మరాజు, కర్రి భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు

నా భవిష్యత్తు మీ చేతుల్లోనే..
నా భవిష్యత్తు మీ చేతుల్లోనే ఉందని.. వచ్చే ఎన్నికల్లో ఓట్లు వేసి ఎమ్మెల్యేగా గెలిపించాలని మంత్రి కొట్టు సత్యనారాయణ కోరారు. ఆయా సమావేశాల్లో ఆయన మాట్లాడుతూ సీఎం జగన్ పాదయాత్రలో ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చారన్నారు. రానున్న ఎన్నికల్లో జగన్‌ను మరోమారు ముఖ్యమంత్రి చేసేందుకు ప్రజలంతా సిద్ధంగా ఉన్నారన్నారు. గతంలో చంద్రబాబు రజకులకు, గౌడ వర్గీయులకు ఇచ్చిన హామీలను ఎంతవరకు నెరవేర్చారో, వారిని ఎలా ఇబ్బందులకు గురిచేశారో గుర్తించి రానున్న ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పాలని మంత్రి కొట్టు పిలుపునిచ్చారు.



ఘనంగా మట్టల ఆదివారం

జిల్లావ్యాప్తంగా క్రైస్తవ మందిరాల్లో ఈస్టర్ పర్వదినాన్ని పురస్కరించుకుని మట్టల ఆదివారం వేడుకలు ఘనంగా జరిగాయి. క్రైస్తవ విశ్వాసులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఏసు క్రీస్తు పునరుత్థానం గురించి వాక్యోపదేశకులు ఆధ్యాత్మిక ప్రసంగాలు చేశారు. అనంతరం జయము జయము అంటూ ఊరేగింపులు నిర్వహించారు. ఉండిలో ఊరేగింపుగా వెళుతున్న ఎన్నార్పీ అగ్రహారం ట్రినిటీ లూథరన్ చర్చి సభ్యుల దృశ్యమిది. – ఉండి

క్లుప్తంగా

పట్టుబడ్డ రొయ్యల దొంగలు



అప్పారావుపేటలో దొరికిన రొయ్యల దొంగలు

ఆకివీడు: తెల్లవారుజామున చెరువుల్లో రొయ్యలను పట్టి దొంగిలిస్తున్న ముఠాను కోళ్లపర్రులో ఆదివారం తెల్లవారుజామున రైతులు పట్టుకుని పోలీసులకు అప్పగించారు. వివరాలిలా ఉన్నాయి. మండలంలోని అప్పారావుపేట గ్రామంలో జెడ్పీటీసీ సభ్యులు వేగేశ్న వెంకట్రాజు (యండగండి శ్రీను)కు చెందిన రొయ్యల చెరువులోని రొయ్యల్ని కొందరు వ్యక్తులు దొంగిలిస్తున్నారు. గత మూడు రోజులుగా చెరువులో రొయ్యల్ని దొంగిలిస్తున్నారని యండగండి శ్రీను ఆయా ప్రాంత రైతులకు తెలియజేశారు. గత మూడు రోజులుగా 45 కౌంట్‌కు వచ్చిన రొయ్యల్ని దొంగిలించుకుపోతున్నారని రైతు యండగండి శ్రీను వాపోయారు. ఇదిలా ఉండగా, ఆదివారం తెల్లవారుజామున చెరువు వద్దకు వెళ్లుతున్న కోళ్లపర్రు రైతు యండపల్లి శ్రీనివాస్ రొయ్యలు పట్టుకుపోతున్న వ్యక్తుల్ని అడ్డగించి, నిలదీయడంతో అసలు విషయం బయటపడింది. ఈ సంఘటనలో ఆకివీడు, అప్పారావుపేట, చెరుకుమిల్లి గ్రామానికి చెందిన ఆరుగురు వ్యక్తుల్ని పట్టుకుని ఆకివీడు పోలీసులకు అప్పగించారు. దొంగిలించిన రొయ్యల్ని ఆకివీడులోని అయిభీమవరం రోడ్డులో ఓ రిటైల్ కొనుగోలుదారుడికి విక్రయిస్తున్నట్లు రైతులు చెబుతున్నారు. యండగండి శ్రీను ఫిర్యాదు మేరకు ఎస్సై బి.నాగబాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

పాలకోడేరు: విస్సాకోడేరు మంచినీటి చెరువు వాటర్ ట్యాంక్ సమీపంలో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభించినట్లు నాలం శ్రీనివాసరావు ఆదివారం చెప్పారు. గత కొన్ని రోజులుగా మతిస్థిమితం లేని వ్యక్తి వాటర్ ట్యాంక్ సమీపంలో సంచరిస్తున్నట్లు స్థానికులు తెలిపారన్నారు. ఆదివారం సాయంత్రం చూడగా ఆ వ్యక్తి మృతి చెంది ఉన్నట్లు స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతుడు కుడిచేతిపై త్రిశూలం బొమ్మ, శ్రీజరూప పేర్లతో పచ్చబొట్టు, మెడలో రెండు చైన్లు, ఒంటిపై బ్లూ కలర్ జీన్ ప్యాంటు, తెలుపు రంగు బనియన్ ధరించి ఉన్నాడన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం భీమవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

కాక పుట్టిస్తున్న పామాయిల్

- 50 శాతం మేర తగ్గిన దిగుమతులు
- ఇబ్బడిముబ్బడిగా సన్‌ఫ్లవర్ దిగుమతులు
- సన్‌ఫ్లవర్‌ను మించిన పామాయిల్ ధర

పామాయిల్ ధర కాక రేపుతోంది. కరోనా సమయంలో మాదిరిగా ఈ ఆయిల్ ధర పెరిగి ప్రస్తుతం చుక్కలు చూపుతోంది. మలేషియా, ఇండోనేషియాలలో ఒక్కసారిగా ఉత్పత్తి పడిపోవడంతో దిగుమతులు దాదాపుగా 50 శాతం మేర తగ్గాయి. మరో వైపు ఉక్రెయిన్, రష్యాల నుంచి ఇబ్బడిముబ్బడిగా సన్‌ఫ్లవర్ నూనె దిగుమతులు పెరిగి మార్కెట్‌ను ముంచెత్తడంతో దీని ధర సామాన్యులకు అందుబాటులోకి వచ్చింది. అయితే రిటైల్ వ్యాపారులు సిండికేట్‌గా మారి తగ్గిన ధరకు విక్రయాలు జరగడం లేదు. ఈ నేపథ్యంలో మార్కెట్‌లో ప్రస్తుతం సన్‌ఫ్లవర్ కంటే పామాయిల్ ధరే అధికంగా ఉండటం గమనార్హం.



తాడేపల్లిగూడెం: మలేషియా, ఇండోనేషియాలలో పామాయిల్ ఉత్పత్తి ఒక్క సారిగా తగ్గింది. పామ్ క్రూడ్, పామ్ రిఫైనరీ నూనెలు కూడా ఇక్కడి అవసరాలకు తగినట్టుగా దిగుమతి కావడం లేదు. జిల్లా అవసరాల నిమిత్తం కాకినాడ పోర్టు నుంచి సుమారు 80 ట్యాంకర్ల పామాయిల్ (ఒక్కొక్క ట్యాంకర్ పదివేల కిలోలు) లేదా పామ్‌క్రూడ్ దిగుమతి అయ్యేది. అలాంటిది ప్రస్తుతం 30 ట్యాంకర్లు మించి రావడంలేదు. ఈ ప్రభావంతో పామాయిల్ నూనె ధరలకు రెక్కలు వచ్చాయి. ఇంటి అవసరాలకు మాత్రమే ఎక్కువగా సన్‌ఫ్లవర్ నూనెను వినియోగిస్తారు. రోడ్ల పక్క వ్యాపారాలు చేసే వారు, హోటళ్ల నిర్వాహకులు, వంటలు చేసే వారు పామాయిల్‌ను ఎక్కువగా వాడతారు. పామాయిల్ నూనె ఉత్పత్తి తగ్గడానికి మలేషియాలో ఫ్యాక్టరీలపై రంజాన్ ప్రభావం ఉండటమే. రంజాన్ మాసం అంతా కార్మికులు పరిశ్రమల్లో పనులకు హాజరు కారు. ఇది కూడా ధర పెరగడానికి ఒక కారణంగా విశ్లేషిస్తున్నారు.

మూతపడిన రిఫైనరీలు

పామ్‌క్రూడ్ దిగుమతులు తగ్గడంతో కృష్ణపట్నం పోర్టులో మూడు, కాకినాడ పోర్టులో రెండు, చెన్నై పోర్టులో రెండు నూనె శుద్ధి కర్మాగారాలు మూతపడ్డాయి. ఆయిల్ దిగుమతి చేసుకున్నా, శుద్ధికోసం, ఇతర ఖర్చులు పెరిగిన నేపథ్యంలో ఈ పరిస్థితి వచ్చినట్టు రిఫైనరీల నిర్వాహకులు చెబుతున్నారు. దీనికి తోడు ఆర్థిక సంవత్సరం ముగుస్తుండటం కూడా దిగుమతులు కూడా తగ్గుతాయి. ఇది కూడా పామాయిల్ ధర పెరగడానికి ఓ కారణంగా చెబుతున్నారు. దీంతో ఉన్న నిల్వలనే వినియోగించుకుంటున్నారు.

కిలో రూ.వందకు చేరిన పామాయిల్ ధర

పామాయిల్ ధర రిటైల్ మార్కెట్‌లో కిలో వంద రూపాయలకు పైగా చేరింది. లీటరు ప్యాకెట్లు 910 గ్రాములలో వచ్చేవి. అలాంటిది ప్రస్తుతం మార్కెట్‌లో 850 గ్రాముల నూనె ప్యాకెట్లు అందుబాటులో ఉన్నాయి. గుత్త మార్కెట్‌లో కిలో పామాయిల్ ధర రూ.107గా ఉంది. విడిగా రూ.110లకు మించి అమ్ముతున్నారు. ఇదే సమయంలో సన్‌ఫ్లవర్ ఆయిల్ కిలో రూ.97కు విక్రయించాలి. అలా కాకుండా పామాయిల్ ధరకే ఈ నూనెను విక్రయించుకుని వ్యాపారులు కొందరు సొమ్ము చేసుకుంటున్నారు. రెండు నెలలుగా మార్కెట్‌లో ఇవే పరిస్థితులు నెలకొన్నా, రంజాన్ ప్రారంభం నుంచి మళ్లీ పామాయిల్ నూనెకు రెక్కలు వచ్చాయి. వేరుశనగ నూనె కిలో రూ.160 పైగా ఉంది.

రంజాన్ తరువాత ధర తగ్గే అవకాశం

పామాయిల్ ధర పెరగడానికి మలేషియాలో ఉత్పత్తి తగ్గడం ఒక కారణం. పైగా రంజాన్ మాసంలో అక్కడి కార్మికులు పామాయిల్ తయారీ పరిశ్రమలకు పనులకు రారు. దీంతో నూనె ఉత్పత్తి తగి దేశానికి దిగుమతులు పడిపోయాయి. ఈ ప్రభావం పామాయిల్ ధరపై పడింది. రంజాన్ దాటిన తర్వాత ధరలు తగ్గవచ్చు.

– పవన్, వ్యాపారి, తాడేపల్లిగూడెం

60 లీటర్ల సారా స్వాధీనం



బెల్లం ఊటను ధ్వంసం చేస్తున్న దృశ్యం

కుక్కునూరు: మండలంలోని సారా తయారీ కేంద్రాలపై ఎస్ఈబీ దాడులు ఆదివారం కొనసాగాయి. ఈ దాడులలో 5 వేల లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేసి, 60 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నారు. అలాగే అంతరాష్ట్ర చెక్ పోస్ట్ వద్ద నిర్వహించిన తనిఖీలలో ఓ వ్యక్తి ఎన్‌డీపీ మద్యాన్ని తరలిస్తుండగా గుర్తించి అతని నుంచి 26 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఈబీ సీఐ సునీల్‌కుమార్ చెప్పారు. దాడులలో జిల్లా టాస్క్‌ఫోర్స్ ఎస్సై నరసింహారావు, ఏఎస్సై పూర్ణ, హెడ్‌కానిస్టేబుల్ ప్రసాద్, లోకల్ కానిస్టేబుల్ దుర్గారావు పాల్గొన్నారు.

మద్యం విక్రేత అరెస్టు

ముసునూరు: మద్యం అక్రమంగా విక్రయిస్తున్నాడనే సమాచారంతో దాడి చేసి ఒక వ్యక్తిని అదుపులోకి తీసుకుని ఐదు క్వార్టర్ బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై పి.వాసు చెప్పారు. చింతలవల్లికి చెందిన పలగాని హనుమంతరావు నిత్యం మద్యం విక్రయిస్తున్నాడనే సమాచారంతో అతనిపై నిఘా పెట్టి ఆదివారం దాడి చేశామన్నారు. దాడిలో నిందితుడిని అదుపులోకి తీసుకుని, మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నిందితుడిని సోమవారం నూజివీడు కోర్టులో హాజరుపరుస్తామని చెప్పారు.

భీమవరంలో ముగిసిన టెన్నిస్ టోర్నీ



35+ డబుల్స్ విభాగంలో ట్రోఫీ అందుకుంటున్న ఎస్.పట్నాయక్, ఎన్‌డీ విజయ్ ఆనంద్

భీమవరం: భీమవరం కాస్మో పాలిటన్ క్లబ్‌లో గత నాలుగు రోజులుగా ఉత్కంఠ భరితంగా సాగిన ఆల్ ఇండియా సీనియర్ ర్యాంకింగ్ టెన్నిస్ టోర్నమెంట్ పోటీలు ముగిశాయి. ఆదివారం జరిగిన ఫైనల్స్‌లో క్రీడాకారులు హోరాహోరీగా తలపడ్డారు. పోటీల్లో విజేతల వివరాలను నిర్వాహకులు వెల్లడించారు.

35+ విభాగంలో : ఎన్‌డీ విజయ్ ఆనంద్‌పై డాక్టర్ ఎస్.పట్నాయక్ 1-6, 1-6 స్కోర్‌తో విజయం సాధించారు.

45+ విభాగంలో : ఆర్.మణి కందన్‌పై కె.వెంకట నారాయణ 6-7 (4-7), 6-2, 8-10 స్కోర్‌తో గెలుపొందారు.

55+ విభాగంలో : బీజీ నగేష్‌పై డి.హేమంత్ కుమార్ 3-6, 6-2, 2-10 స్కోర్‌తో విజయం సాధించారు.

35+ డబుల్స్ విభాగంలో : ఎం.విజయ్ వర్మ, ఈశ్వరసాయిపై డాక్టర్ ఎస్.పట్నాయక్, ఎన్‌డీ విజయ్ ఆనంద్ 1-6, 3-6 స్కోర్‌తో విజయం సాధించారు

45+ డబుల్స్ విభాగంలో : ఆర్.మణి కందన్, కె.వెంకటనారాయణమూర్తిపై కె.సంపత్ కుమార్, ఏఎస్ రావు 5-7, 5-7 స్కోర్‌తో గెలుపొందారు.

55+ డబుల్స్ విభాగంలో డి.సుధాకర్‌రెడ్డి, డాక్టర్ ఎ.శంకర్‌రెడ్డిపై బీజీ నగేష్, బిశ్వజిత్ రాయ్ 2-6, 1-6 స్కోర్‌తో విజయం సాధించారు. అనంతరం విజేతలకు ట్రోఫీలను అందజేశారు.

వైఎస్సార్ సీపీలోకి 30 కుటుంబాలు



దెందులూరు ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరుతున్న కొత్తూరుకు చెందిన 30 కుటుంబాల సభ్యులు

పెదపాడు: దెందులూరు ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి సమక్షంలో కొత్తూరు గ్రామానికి చెందిన 30 కుటుంబాలు ఆదివారం వైఎస్సార్ సీపీలో చేరాయి. కొత్తూరులో ఆదివారం ఎమ్మెల్యే పర్యటన సందర్భంగా ఆయా కుటుంబాలు పార్టీలో చేరాయి. ఈ సందర్భంగా ఆయా కుటుంబ సభ్యులు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పేద ప్రజలకు అందిస్తున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులమయ్యామని, దెందులూరు ఎమ్మెల్యే అబ్బయ్య చౌదరి నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను పరిష్కరిస్తున్న తీరు తమను వైఎస్సార్ సీపీ వైపు నడిపించిందన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అబ్బయ్య చౌదరి మాట్లాడుతూ పేద ప్రజల బ్యాంక్ ఖాతాల్లో వివిధ పథకాల రూపంలో నేరుగా రూ.2.77 లక్షల కోట్లను జమ చేశామన్నారు. నాన్ డీబీటీ ద్వారా మరో రూ.2 లక్షల కోట్లు ప్రజల కోసం ఖర్చు చేశామని వివరించారు. గతంలో ఎన్నడూ లేని విధంగా నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తున్నామన్నారు. నియోజకవర్గంలో చేసిన అభివృద్ధికి ప్రజల నుంచి విశేష ఆదరణ లభిస్తోందని సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ, ఎంపీపీ బత్తుల రత్నకుమారి, గ్రామ సర్పంచ్ కడిమి పద్మావతి, కడిమి గోవిందరావు, గ్రామంలోని వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

బ్యాటరీల చోరీల కేసులో నలుగురి అరెస్టు

ఆగిరిపల్లి : సెల్‌ఫోన్ టవర్లకు చెందిన బ్యాటరీలు చోరీ చేసిన కేసుల్లో నలుగురు నిందితులను అరెస్ట్ చేసినట్లు ఎస్సై సురేంద్ర కుమార్ చెప్పారు. వివరాలిలా ఉన్నాయి. శుక్రవారం రాత్రి ఏలూరుకు చెందిన సొంగా అశోక్, చిన్న ముత్తేవి గాంధీ, దాసరి మణి, దాసరి సువార్త కలిసి ఆగిరిపల్లిలోని బీఎస్ఎన్ఎల్ టవర్ వద్ద ఉన్న 18 బ్యాటరీలను దొంగలించారు. అలాగే శనివారం వట్టిగుడిపాడులోని ఎయిర్‌టెల్ టవర్ వద్ద 4 బ్యాటరీలను దొంగలించారు. వీటి విలువ రూ.1.25 లక్షలు ఉంటుందన్నారు. ఆదివారం ఆగిరిపల్లి హైస్కూల్ వద్ద ఎస్సై వాహనాలు తనిఖీ చేస్తుండగా ఆటోలో వస్తూ నలుగురు నిందితులు పట్టుబడ్డారు. వీరి నుంచి బ్యాటరీలు స్వాధీనం చేసుకుని నూజివీడు కోర్టులో హాజరుపరచగా రిమాండ్ విధించినట్లు ఎస్సై తెలిపారు.

వ్యాన్ ఢీకొని వ్యక్తి మృతి

జంగారెడ్డిగూడెం: వ్యాన్ ఢీకొనడంతో ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. వివరాలిలా ఉన్నాయి. నాగులగూడెంకు చెందిన జంపన శ్రీనివాసరావు (30) ప్రైవేట్ ఉద్యోగం చేస్తున్నాడు. ఆదివారం బుట్టాయిగూడెం మండలం గంగవరంలో వివాహ వేడుకలో పాల్గొనేందుకు శ్రీనివాసరావు ద్విచక్రవాహనంపై వెళుతుండగా, పారిజాతగిరి సమీపంలో హైవేపై కొయ్యలగూడెం నుంచి జీలుగుమిల్లి వైపు వెళుతున్న వ్యాన్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో శ్రీనివాసరావు ఘటనా స్థలంలోనే మృతి చెందాడు. ఎస్సై జ్యోతిబాస్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యతోనే ఉన్నత శిఖరాలు

- సినీ నటుడు సుమన్
- గుండుగొలనులో దివ్యాంగుల సేవా కార్యక్రమానికి హాజరు



దివ్యాంగుల సేవా సమితికి రూ.3 లక్షల చెక్కును అందిస్తున్న సినీ నటుడు సుమన్, పెద్దలు

భీమడోలు : విద్యతోనే జీవితంలో ఉన్నత శిఖరాలు అధిరోహించవచ్చని సినీ నటుడు సుమన్ అన్నారు. గుండుగొలనులో విఘ్నేశ్వర దివ్యాంగుల సేవా సమితి ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన సామాజిక సేవ కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. తాను ఉన్నత స్థితికి చేరడానికి అమ్మ చేసిన సేవే అని గుర్తుకు తెచ్చుకున్నారు. తన తల్లి కళాశాల ప్రిన్సిపాల్‌గా పనిచేస్తూ వచ్చిన జీతాన్ని పేద విద్యార్థుల అవసరాలకు వినియోగించే వారని, తద్వారా కొన్ని సందర్భాల్లో మధ్య తరగతి కుటుంబం కావడంతో చాలా ఇబ్బందులు పడేవారమన్నారు. పేదలకు సేవలందించే స్వచ్ఛంద సంస్థలు నిర్వహించే కార్యక్రమాలకు తాను హాజరుకావడానికి ఆసక్తి చూపుతానన్నారు. తాను మార్షల్ ఆర్ట్స్ నేర్చుకున్న తర్వాత మిత్రుడు భానుచందర్ ద్వారా సినీ ఆరంగేట్రం చేశానని, ఇప్పటివరకు పది భాషల్లో 800 సినిమాల్లో నటించానని, వాటిలో 100 చిత్రాలు తెలుగులోనే నటించి తెలుగు ప్రజల హృదయాల్లో నిలిచానన్నారు. తాను రాజకీయాలకు దూరంగా ఉంటానన్నారు. నేటి సమాజంలో ప్రతి ఒక్కరికి విద్య అవసరమన్నారు. ప్రతి ఒక్కరూ చదువుకుని ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. 9 ఏళ్లుగా దివ్యాంగులకు సేవలందిస్తున్న నిర్వాహకులను అభినందించారు. తొలుత శ్రీవిద్యాలయ విద్యాసంస్థ చిన్నారులు ప్రదర్శించిన నృత్యాలు, మార్షల్ ఆర్ట్స్ ఆకట్టుకున్నాయి. అనంతరం నేరోలాక్ ప్రతినిధుల ఆర్థిక సాయంతో 60 మంది దివ్యాంగులకు బియ్యం, పండ్లను సుమన్ చేతుల మీదుగా అందించారు. శ్రీవిద్యాలయ విద్యార్థులు సమకూర్చిన రూ.3 లక్షల చెక్కును సుమన్ చేతుల మీదుగా నిర్వాహకులకు అందించారు. తొలుత సుమన్‌ను అర్చకులు లంకా శివకుమార్, శ్రీనివాస్ వేదమంత్రోచ్చరణ మధ్య సన్మానించారు,. అనంతరం గ్రామపెద్దలు, నిర్వాహకులు ఆయనకు మొమెంటో, శాలువాను కప్పి ఘనంగా సత్కరించారు. వెండితెర నటులు అల్లం గోపాలరావు, అల్లం అనిల్, ట్రస్ట్ అధ్యక్షుడు దాట్ల సీతారామరాజు, అధ్యక్షుడు గేదెల శ్రీనివాసరావు, సినీ డైరెక్టర్ తోట రవి, పేరిచర్ల శ్యామలరాజు, చప్పిడి సత్యనారాయణ పాల్గొన్నారు.

ఆంధ్రా కాలువకు మంచి రోజులు

- కాలువ మరమ్మతులకు ఎంపీ ల్యాడ్స్ నుంచి రూ.30 లక్షల మంజూరు
- ఇప్పటికే పనులు ప్రారంభించిన అధికారులు.. రైతుల్లో హర్షాతిరేకాలు



ఖమ్మం జిల్లా తుమ్మూరు వద్ద ఆంధ్ర - తెలంగాణ సరిహద్దులో ఆంధ్రా కాలువపై నిర్మించిన గోడ



ఆంధ్రా కాలువలో పూడిక తొలగించి మరమ్మతులు చేస్తున్న దృశ్యం

చింతలపూడి : ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో దశాబ్దాల చరిత్ర కలిగిన ఆంధ్రా కాలువకు ఎట్టకేలకు మంచి రోజులు రానున్నాయి. ఆయకట్టు రైతుల వినతి మేరకు ఏలూరు పార్లమెంట్ సభ్యులు కోటగిరి శ్రీధర్‌బాబు ఆంధ్రా కాలువ మరమ్మతులకు తన ఎంపీ నిధుల నుంచి రూ.30 లక్షలు కేటాయించారు. దీంతో కాలువ మరమ్మతు పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. దశాబ్దాల కాలంగా మరమ్మతులకు నోచుకోకపోవడంతో పూడిక పెరిగి సాగునీటి పారుదలకు అడ్డంకిగా మారింది. ఈ నేపథ్యంలో ఆంధ్రాకాలువకు నిధులు కేటాయించడంపై ఎంపీ కోటగిరి శ్రీధర్‌బాబుకు రైతులు కృతజ్ఞతలు తెలుపుతున్నారు. 1967లో ఏలూరు జిల్లాలోని మెట్ట ప్రాంతంలో 21 చెరువులకు సాగునీరు అందించడానికి ఖమ్మం జిల్లా తుమ్మూరు వద్ద ఆనకట్ట నిర్మించారు. అక్కడి నుంచి 18 కిలోమీటర్ల పొడవున కాలువ నిర్మాణం చేపట్టి వరద నీటిని సాగునీటి చెరువులకు మళ్లిస్తున్నారు. మండలంలో దాదాపు 11 వేల ఎకరాలకు అధికారికంగా, మరో 10 వేల ఎకరాలకు అనధికారికంగా ఏటా సాగునీరు అందుతోంది. దీంతో పాటు జిల్లాలోని చింతలపూడి మండలం నాగిరెడ్డిగూడెం వద్ద నిర్మించిన తమ్మిలేరు ప్రాజెక్టు సైతం ఆంధ్రా కాలువ ద్వారా వచ్చే వరద నీటిపై ఆధారపడి ఉంది. ఈ ప్రాజెక్టు కింద ఎన్టీఆర్ కృష్ణా జిల్లా, ఏలూరు జిల్లాల్లో అధికారికంగా 9,169 ఎకరాలు సాగవుతుండగా, ఏటి కాలువ దిగువన సుమారు 20 వేల ఎకరాలకు పైగా సాగు చేస్తున్నారు. రాష్ట్ర విభజన సమయంలో ఆంధ్రాలోని నీటి ప్రాజెక్టులు, ఎత్తి పోతల పథకాల గురించి రాష్ట్రానికి చెందిన అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వంలోని కేంద్ర మంత్రులు, రాష్ట్ర మంత్రులు, ప్రజాప్రతినిధులు కేంద్రం దృష్టికి తీసుకువెళ్లకపోవడంతో ఆంధ్రా కాలువ, తమ్మిలేరు ప్రాజెక్టుల పరిస్థితి ప్రశ్నార్థకంగా మారిందని జిల్లాలోని మెట్ట ప్రాంత రైతులు ఇప్పటికీ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గతంలో అనేకసార్లు ఖమ్మం, ఏలూరు జిల్లాల రైతుల మధ్య సాగునీటి వివాదాలు తలెత్తి ఘర్షణలు చోటుచేసుకున్న సంఘటనలు ఉన్నాయి. ఆంధ్రా కాలువ ద్వారా మన రాష్ట్రంలోని తమ్మిలేరుకు వచ్చే వరద నీరు రాకుండా ఖమ్మం జిల్లా సత్తుపల్లి మండలం బేతుపల్లి చెరువు అలుగు ఎత్తును పెంచి అక్కడి ప్రజాప్రతినిధులు అడ్డుకుంటూ వస్తున్నారు. గతంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఈ వివాదంపై ముగ్గురు రాష్ట్ర స్థాయి రిటైర్డ్ ఇంజినీర్లను నియమించినా ఫలితం లేకపోయింది. అనంతరం తెలంగాణ రాష్ట్రం ఏర్పడటంతో శాశ్వతంగా వరద జలాలను దిగువకు రాకుండా తెలంగాణ ప్రభుత్వం అడ్డుకుంటోంది. గతంలో నీటి వినియోగం విషయంలో ఒప్పందం ఉన్నప్పటికీ అమలుకు నోచుకోవడం లేదు.

చింతలపూడి ఎత్తిపోతలే శరణ్యం

ఆంధ్రాకాలువకు పూర్వ వైభవం తిరిగి రావాలంటే నిర్మాణంలో ఉన్న చింతలపూడి ఎత్తిపోతల పథకం పరిధిలోకి ఆంధ్రా కాలువను తీసుకువస్తే సాగునీటి కష్టాలు గట్టెక్కుతాయని రైతులు భావిస్తున్నారు. ప్రస్తుతం చింతలపూడి ఎత్తిపోతల పథకం కాంతంపాలెం వరకు వచ్చి అక్కడి నుంచి మల్లాయగూడెం మీదుగా కృష్ణా జిల్లాలోకి ప్రవేశిస్తుంది. ఈ పథకం డిజైన్‌ను కొద్దిగా మార్పు చేసి యండపల్లి వరకు పొడిగిస్తే అక్కడి నుంచి ఆంధ్రా కాలువకు ఏడాది పొడవునా సాగునీరు లభిస్తుందని సూచిస్తున్నారు.

ఎంపీ శ్రీధర్ బాబుకు కృతజ్ఞతలు



గత ప్రభుత్వాల హయాంలో నిర్లక్ష్యానికి గురైన ఆంధ్రాకాలువ అభివృద్ధికి ఎంపీ కోటగిరి శ్రీధర్‌బాబు రూ.30 లక్షల నిధులు మంజూరు చేసినందుకు కృతజ్ఞతలు. ప్రస్తుతం ఎన్నికల కోడ్ అమలులో ఉండటంతో ఎన్నికలు పూర్తయిన తరువాత కాలువ ఆయకట్టు రైతుల సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించడానికి ఎంపీ చర్యలు తీసుకుంటానన్నారు.

– గిరి భోగారావు, సొసైటీ చైర్మన్, ఆయకట్టు రైతు, చింతలపూడి

క్లుప్తంగా

లయన్స్ క్లబ్ సేవలు అభినందనీయం



లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు

తాడేపల్లిగూడెం (టీఓసీ): లయన్స్ క్లబ్ ఆఫ్ డైమండ్స్ అభయం లియో లయన్స్ ఆధ్వర్యంలో ఆదివారం పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. లార్డ్స్ ఆఫ్ లైఫ్ చిల్డ్రన్ హోం, ప్రేమాలయం ఆశ్రమంలో బ్రెడ్స్, స్నాక్స్, విద్యార్థులకు స్టేషనరీ వస్తువులు అందజేశారు. క్లబ్ తరఫున పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న ఆరా ఫౌండేషన్ అధినేత కరిబండి రామకృష్ణను అభినందించారు. సంపత్ కుమార్, కె.సత్యనారాయణరాజు, జామి సత్యనారాయణ, యర్రా ఆంజనేయస్వామి అంబికా, మాధురి తదితరులు పాల్గొన్నారు.

కరువు భత్యం జీఓపై హర్షం



మాట్లాడుతున్న అధ్యక్షుడు బి.హరికుమార్

తాడేపల్లిగూడెం (టీఓసీ): కరువు భత్యం జీఓ పట్ల స్టేట్ గవర్నమెంట్ పెన్షనర్స్ అసోసియేషన్ హర్షం ప్రకటించింది. పెన్షనర్స్ కార్యాలయం వద్ద ఆదివారం సంఘ సమావేశం అధ్యక్షుడు బి.హరికుమార్ అధ్యక్షతన నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ డీఆర్ బకాయిలు, పీఆర్‌సీ బకాయిలు చెల్లించాలని విజ్ఞప్తి చేశారు. ఇంకా జీవన ప్రమాణ పత్రాలు దాఖలు చేయని వారు వెంటనే దాఖలు చేయాలని కోరారు. కార్యక్రమంలో వైవీఎస్ మూర్తి, వి.విస్సంరాజు, వి.రామ్మోహన్‌రావు, ముస్తాఫా, గరికిపాటి సుబ్రహ్మణ్య శర్మ తదితరులు పాల్గొన్నారు.

మండపాకలో చలివేంద్రం ఏర్పాటు



మండపాక బస్టాండ్ వద్ద ఆదివారం ఏర్పాటు చేసిన చలివేంద్రం

తణుకు టౌన్: తణుకు రూరల్ మండలం మండపాకలో మండల వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు జంగం ఆనందకుమార్ ఆధ్వర్యంలో ప్రతీ ఏటా నిర్వహించే చలివేంద్రాన్ని ఆదివారం ప్రారంభించారు. మండపాకలోని ఆర్టీసీ బస్టాండ్ వద్ద రిటైర్డ్ ఉపాధ్యాయుడు జంగం అర్జున జ్ఞాపకార్థం ఏటా చలివేంద్రం ఏర్పాటు చేస్తున్నారు. వేసవిలో ఈ చలివేంద్రం ఎంతో ఉపయోగపడుతుందని గ్రామస్తులు పేర్కొంటున్నారు.

వైఎస్సార్‌సీపీ ముఖ్య కార్యకర్తల సమావేశం



వైఎస్సార్‌సీపీ కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న మండలపార్టీ నాయకులు

ఇరగవరం: ఇరగవరం మండలం యర్రాయిచెర్వు గ్రామంలో పౌరసరఫరాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు ఆధ్వర్యంలో ఆదివారం బూత్ కన్వీనర్ కార్యకర్తలతో సమావేశం జరిగింది. కార్యక్రమంలో జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు పాల సత్యనారాయణ, మండల పార్టీ అధ్యక్షుడు కొప్పిశెట్టి దుర్గా ప్రసాద్, సాయిబాబారెడ్డి, జోషి, దినేష్‌రెడ్డి, పితాని వెంకట భగవాన్, కుక్కల సత్యనారాయణ, జక్కంశెట్టి ఏడుకొండలు, జుత్తిగ వీర వెంకట సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన ఎన్ఎస్ఎస్ శిబిరం



ఆకుతీగపాడులో పర్యావరణ ర్యాలీ నిర్వహిస్తున్న ఎన్ఎస్ఎస్ విద్యార్థులు

పెంటపాడు: ఆకుతీగపాడులో గత వారం రోజులుగా నిర్వహిస్తున్న ఎన్ఎస్ఎస్ సేవా శిబిరం ఆదివారంతో ముగిసింది. ఈ సందర్భంగా గోయంకా విద్యార్థులు, ఎన్ఎస్ఎస్ సిబ్బంది గ్రామంలో పర్యావరణ ర్యాలీ నిర్వహించారు. చెత్తను వీధులలో పారవేయకుండా మురుగునీటిని నిల్వ ఉంచకుండా, కాచి చల్లార్చిన నీటిని తాగాలని, ఆరోగ్య సలహాలు పాటించాలని, ప్లాస్టిక్‌ను నిర్మూలించాలని, ఇలా పలు చర్యలు వివరించారు. మొక్కలు నాటారు. ఎన్ఎస్ఎస్ పీవో విజయబాబు, జాన్‌బాబు, ప్రేమ్‌సాగర్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

రాష్ట్రానికి దిశానిర్దేశం జగన్‌తోనే సాధ్యం

రెడ్డి సంఘస్తుల ఆత్మీయ సమావేశంలో డిప్యూటీ సీఎం



పెంటపాడు రెడ్డి సంఘస్తుల ఆత్మీయ సమావేశంలో ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణకు సన్మానం

పెంటపాడు: ఐదేళ్ల పాలనలో రాష్ట్ర ప్రజలకు స్వర్ణ యుగం అందించిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే రాష్ట్రానికి దిశానిర్దేశం సాధ్యమని ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ పేర్కొన్నారు. పెంటపాడులో నల్లమిల్లి గాంధీరెడ్డి స్వగృహం వద్ద నియోజవర్గ రెడ్డి సంక్షేమ సంఘ ఆత్మీయ సమ్మేళనం ఆదివారం సాయంత్రం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపముఖ్యమంత్రి మాట్లాడుతూ గతంలో ముఖ్యమంత్రిగా ఉన్న వైఎస్ రాజశేఖరెడ్డి ద్వారానే తాను నియోజక అభివృద్ధి సాధించగలిగానన్నారు. అదే ఒరవడితో మళ్లీ ఆయన తనయుడు వైఎస్ జగన్మోహన్‌రెడ్డి హయంలోనే ఉపముఖ్యమంత్రి పదవి వరించిందన్నారు. తనను ఇంతగా ఆదరించిన అన్ని వర్గాల ప్రజలతో పాటు, ప్రధానంగా రెడ్డి కులస్తుల సహకారం మరువలేనిదన్నారు. నియోజవర్గంలో సేవా, త్యాగ గుణాలకు ప్రతీకగా నిలచిన రెడ్డి కులస్తులు వారి సొంత ప్రయోజనాలు కోరుకోకుండా ఉన్నతంగా నిలుస్తున్నారన్నారు. ఈ ఎన్నికలలో రెడ్డి కులస్తులు ఐక్యంగా ఉండి మరో మారు తనను గెలిపించాలన్నారు. నియోజవర్గ స్థాయిలో భారీగా నిర్మించబోయే రెడ్డి కల్యాణమండపానికి తనవంతు సాయం చేస్తానన్నారు. ఈ సందర్భంగా నియోజవర్గంలోని పలువురు రెడ్డి సంఘ సభ్యుల సందేహాలను మంత్రి నివృత్తి చేశారు. రెడ్డి సంక్షేమ సంఘ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు ద్వారంపూడి వేణుగోపాలరెడ్డి, పెంటపాడు ఉప సర్పంచ్ కొవ్వూరి ప్రసాద్‌రెడ్డి, నియోజవర్గ రెడ్డి సంఘ అధ్యక్షుడు కొవ్వూరి నాగేంద్రరెడ్డి, మేడపాటి చెల్లారెడ్డి, మేడపాటి జనార్ధనరెడ్డి, విద్యావేత్త విజయారెడ్డి, ద్వారంపూడి కిరణ్‌రెడ్డి, కర్రి పృథ్వీకుమార్‌రెడ్డి, నల్లమిల్లి సత్యనారాయణరెడ్డి, సుధా శ్రీనివాసరెడ్డి, రెడ్డిబాబు, రెడ్డి సంఘ నియోజకవర్గ ఉపాధ్యక్షుడు విజయానందరెడ్డి, బస్సుల రెడ్డి, యూత్ అధ్యక్షుడు కొవ్వూరి భాస్కరరెడ్డి, మార్కెట్ కమిటీ సభ్యులు కర్రి వరహాలరెడ్డి, పెంటపాడు రెడ్డి సంక్షేమ సంఘ సభ్యులు, జగన్ యూత్ సంఘ సభ్యులు, ముదునూరుపాడు రెడ్డి సేవా సంక్షేమ సంఘ సభ్యులు పాల్గొన్నారు.

వివేకవంతులే సమాజానికి మార్గదర్శకులు



ఎయిర్‌స్ట్రిప్ వాకర్స్ అసోసియేషన్ సభ్యుల సమావేశంలో మాట్లాడుతున్న ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ

తాడేపల్లిగూడెం అర్బన్: స్థానిక ఎయిర్‌స్ట్రిప్ వాకర్స్ అసోసియేషన్ సభ్యులు, రజక సంఘ నాయకులు, గౌడ సంఘం సభ్యులతో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశాల్లో మంత్రి కొట్టు సత్యనారాయణ పాల్గొన్నారు. మాట్లాడుతూ ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మించడంలో వాకర్స్ అసోసియేషన్ సభ్యులు క్రియాశీలకపాత్ర పోషిస్తున్నారన్నారు. మనిషి ఎంత డబ్బు సంపాదించినా ఆరోగ్యం లేకపోతే అనుభవించడానికి ఏమీ ఉండదని తెలిపారు. తాడేపల్లిగూడెం అభివృద్ధి, శాంతిభద్రతలు ఎవరు సమర్ధంగా నిర్వహించగలరో ఆలోచించాలన్నారు. రాజకీయ నాయకుల ప్రమేయం లేకుండానే తాడేపల్లిగూడెం వాణిజ్య, వ్యాపారం కేంద్రంగా ఖ్యాతిని గడించిందన్నారు. నేడు వాణిజ్య వ్యాపార రంగంతోపాటు విద్యారంగంలోను జాతీయ స్థాయి గుర్తింపును తాడేపల్లిగూడెం సంపాదించుకున్నారు. తాడేపల్లిగూడెం పట్టణాన్ని విద్యారంగంలోను ప్రథమస్థానంలో నిలిపామన్నారు. మహానేత వైఎస్‌రాజశేఖరరెడ్డి సహకారంతో ఆంధ్ర యూనివర్శిటీ క్యాంపస్, హార్టికల్చర్ యూనివర్శిటీ, ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల, వెటర్నరీ పాలిటెక్నిక్ కళాశాల వంటి అనేక విద్యాసంస్థలు స్థాపించామన్నారు. తాడేపల్లిగూడెం అభివృద్ధి చెందాలన్నా, శాంతిభద్రతల కోసం ఎవరు ఎమ్మెల్యేగా ఉంటే బాగుంటుందో వాకర్స్ సభ్యులు ఆలోచించాలన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహనరెడ్డి ప్రజలకు అందించిన సంక్షేమాన్ని గుర్తించాలన్నారు. ముఖ్యమంత్రిగా జగన్‌ను, ఎమ్మెల్యేగా తనను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో వాకర్స్ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు కూచిపూడి వెంకటకృష్ణారావు, వైఎస్సార్‌సీపీ నాయకులు గుండుబోగుల నాగు, కొలుకులూరి ధర్మరాజు, మల్లారెడ్డి సారధి, కప్పల నర్సింహమూర్తి, ప్రవా శ్రీనివాస్, రాగిరెడ్డి నాగవరప్రసాద్, బాకా వెంకటేశ్వరరావు, పి.కుమారస్వామి, మాకా శ్రీనివాసరావు, యోగా గురూజీ బడుగు చంద్రశేఖర్, కుంట రామోహనరావు, తదితరలు పాల్గొన్నారు.

‘అన్నమయ్య’లో నటించడం పెద్ద మలుపు



గుమ్మంపాడులో సుమన్‌ను సత్కరిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

అత్తిలి: అన్నమయ్య చిత్రంలో శ్రీవెంకటేశ్వర స్వామిపాత్రలో నటించడం తన జీవితంలో పెద్ద మలుపు అని ప్రముఖ సినీ నటుడు సుమన్ అన్నారు. అత్తిలి మండలం గుమ్మంపాడు శివారు శ్రీహరి ప్రహ్లాదపురంలోని శ్రీసుబ్రహ్మణ్యేశ్వర గోమహాలక్ష్మి సమేత నారికేళ వరాహ లక్ష్మీనరశింహస్వామి కల్యాణోత్సవ వేడుకలలో సుమన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా సుమన్ మాట్లాడుతూ వెంకటేశ్వరస్వామి పాత్రలో నటించడం ద్వారా తనలో ఆధ్యాత్మిక భావాలు పెరిగాయని, స్వామి కృప వల్ల శ్రీరాముడు, సత్యనారాయణస్వామి వంటి పాత్రలలో నటించానన్నారు. ఎందరో నిర్మాతలు,దర్శకులు ప్రోత్సహించడంతో వివిధ భాషలలో 800కి పైగా సినిమాల్లో నటించానన్నారు. సుమన్‌ను ఆలయ కమిటీ తరపున సత్కరించి, జ్ఞాపిక అందజేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ నిర్వాహకులు పులపర్తి రవీంద్ర ఫణిగోపాల్, శ్రీహరి గోపాల్, గిరిజా పూర్ణిమ, యర్రమిల్లి విశ్వనాథం, విశ్వభారతి తదితరులు పాల్గొన్నారు.

దుర్గమ్మ ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన



యర్రనీలిగుంటలో శ్రీ దుర్గమ్మ ఆలయ నిర్మాణానికి శంకుస్థాపనలో మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు

తణుకు టౌన్: తణుకు రూరల్ మండలం మండపాక శివారు యర్ర నీలిగుంటలో నూతనంగా నిర్మించే శ్రీ దుర్గమ్మ అమ్మవారి గుడి శంకుస్థాపన కార్యక్రమంలో పౌర సరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు పాల్గొన్నారు. యర్రనీలిగుంట ప్రాంతానికి చెందిన శెట్టిబలిజ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన శంకుస్థాపన కార్యక్రమంలో మంత్రి కారుమూరి ముఖ్యఅతిథిగా పాల్గొని అమ్మవారికి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు బోడపాటి వీర్రాజు, మాజీ ఏఎంసీ చైర్మన్ ఉండవల్లి జానకి, బల్లిపాడు సర్పంచ్ బాలాజీ, శెట్టిబలిజ సంఘ పెద్దలు పితాని పుల్లంశెట్టి పాల్గొన్నారు.

భగత్‌సింగ్‌కు నివాళి



తాడేపల్లిగూడెం మండలం మోదుగగుంటలో కొవ్వొత్తుల ర్యాలీ

తాడేపల్లిగూడెం రూరల్: దేశం కోసం ప్రాణాలర్పించిన దేశభక్తుడు భగత్‌సింగ్ అని ఇఫ్టూ జిల్లా సహాయ కార్యదర్శి మామిడి దానవరప్రసాద్ అన్నారు. మండలంలోని మోదుగగుంటలో శనివారం రాత్రి భగత్‌సింగ్ వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా దానవరప్రసాద్ మాట్లాడుతూ నేడు దేశాన్ని పాలిస్తున్న బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్‌లు జాతీయ ఉద్యమంలో ఏనాడూ పాల్గొనలేదన్నారు. దేశం, ప్రజల అభివృద్ధి కోసం పాటుపడే వారిని దేశద్రోహులుగా చిత్రీకరించి ఉపా చట్టం పేరుతో జైల్లో మగ్గేలా చేయడమే బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్ నైజమని పేర్కొన్నారు. అనంతరం గ్రామంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. యూనియన్ అధ్యక్షుడు శ్రీనివాస్, వీరబాబు, పోసేంద్రప్రసాద్, జాన్, ఆంజనేయులు, రాంబాబు, రామ్మోహన్, సూరిబాబు, నాగు, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

జీవితాలు నాశనం చేసుకోవద్దు



విలేకరులతో మాట్లాడుతున్న డీఎస్పీ శ్రీనివాసరావు

పెనుగొండ: కులాలను కించపరుస్తూ, అసభ్యకరమైన పోస్టులును సోషల్ మీడియాలో పెడుతూ జీవితాలు నాశనం చేసుకోవద్దని నరసాపురం డీఎస్పీ జి.శ్రీనివాసరావు హితవు పలికారు. ఆదివారం ఆచంట పోలీస్ స్టేషన్ వద్ద జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సోషల్ మీడియాలో కులాన్ని కించపరుస్తూ, అసభ్యకరంగా పోస్ట్ చేసిన ఆచంట మండలం శేషమ్మ చెరువుకు చెందిన పిల్లి సంతోష్‌కుమార్‌ను అరెస్ట్ చేసినట్లు వివరించారు, ఇన్‌స్టాగ్రామ్‌లో ఒక కులాన్ని కించపరుస్తూ పోస్టు చేయడంతో స్క్రీన్ షాట్ వేరే గ్రూపుల్లో షేర్ చేయడంతో వైరల్ అయ్యిందని తెలిపారు. దీనిపై ఆచంట మండలం కోడేరుకు చెందిన మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు సర్లే శ్రీనివాస్ ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేశామని వివరించారు. ఈ మేరకు పిల్లి సంతోష్‌కుమార్‌ను ఆదివారం అరెస్ట్ చేశామని, కోర్టులో హాజరు పరుస్తామని తెలిపారు. ఎవరైనా కులాలను, మతాలను రెచ్చగొట్టే విధంగా సోషల్ మీడియాలో కానీ, మరే ఇతర సోషల్ మీడియా మాధ్యమాల్లో గానీ పోస్టులు పెడితే వారిపై చట్టారీత్యా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రస్తుతం ఎన్నిక నియమావళి అమలులో ఉన్నందున మరింత అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సమావేశంలో సీఐ కాళీచరణ్, ఎస్సై రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

నత్తారామేశ్వరం యూనియన్ బ్యాంకు విలీనం



నత్తారామేశ్వరంలో మూతబడిన యూనియన్ బ్యాంకు శాఖా కార్యాలయం

పెనుమంట్ర: నత్తారామేశ్వరం గ్రామంలో యూనియన్ బ్యాంకును పెనుమంట్ర యూనియన్ బ్యాంకులో విలీనం చేస్తూ బ్యాంకు అధికారులు ఉత్తర్వులు జారీ చేస్తూ నత్తారామేశ్వరం బ్యాంకును మూసివేశారు. గతంలో కార్పొరేషన్ బ్యాంకుగా ఉన్న ఈ బ్యాంకు కేంద్రం విలీనం చేసిన సందర్భంలో యూనియన్‌బ్యాంకుగా మార్పు చేశారు. అయితే పెనుమంట్రలో కూడా గతంలో యూనియన్ బ్యాంకు ఉండడంతో ఈ బ్యాంకు కేవలం కిలో మీటరు దూరంలో ఉండడంతో ఈ బ్యాంకును పెనుమంట్ర బ్యాంకులో విలీనం చేయాలని అధికారులు గతంలో ఖాతాదారులకు నోటీసులు ఇచ్చారు. అయితే ఖాతాదారులు దానిని వ్యతిరేకిస్తూ ఉద్యమాలు కూడా చేశారు. చివరకు ఈబ్యాంకును పెనుమంట్ర బ్యాంకులో విలీనం చేస్తూ ఈనెల 20న బ్యాంకు వద్ద ప్రకటన బోర్డును తగిలించారు. ఈ నెల 21 నుంచి ఈ బ్యాంకు ఖాతాదారులంతా తమ బ్యాంకు లావాదేవీలను పెనుమంట్ర యూనియన్ బ్యాంకులో నిర్వహించుకోవాలని కోరుతూ ప్రకటనను జారీ చేసి బ్యాంకును మూసివేశారు. అయితే అక్కడ ఉన్న ఏటీఎం మాత్రం యథావిధిగా పనిచేస్తుంది.

ముత్యాలమ్మ ఆలయంలో భక్తుల రద్దీ

మొగల్తూరు: మండలంలోని ముత్యాలపల్లిలో ఉన్న శ్రీ బండి ముత్యాలమ్మ అమ్మవారిని దర్శించుకునేందుకు ఆదివారం భక్తులు భారీగా తరలివచ్చారు. అమ్మవారి దర్శనానికి వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది. భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా ఈఓ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

క్షయ వ్యాధి నివారణపై అవగాహన ర్యాలీ



ఇరగవరంలో క్షయ వ్యాధి నివారణపై ర్యాలీ

ఇరగవరం: ప్రపంచ క్షయ వ్యాధి నివారణ దినోత్సవం సందర్భంగా ఇరగవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ ఆదివారం నిర్వహించారు. వైద్యాధికారి డాక్టర్ వై.మౌనిక ర్యాలీని ప్రారంభించి మాట్లాడారు.

సంచార వైద్యశాల ద్వారా వృద్ధులకు సేవలు

తణుకు టౌన్: తణుకు సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్, నిషా ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో సంచార వైద్యశాల ద్వారా ప్రతి ఆదివారం నిర్వహించే ఉచితవైద్య సేవల్లో భాగంగా ఆదివారం తణుకులోని వివిధ ప్రాంతాల్లోని 9 మంది వృద్ధులకు ఇంటి వద్దనే వైద్య సేవలందించినట్లు అసోసియేషన్ అధ్యక్షుడు ఏ.కరుణాకర్ చౌదరి తెలిపారు. నేత్ర వైద్యులు డాక్టర్ హుస్సేన్ అహ్మద్, తణుకు పాతూరు, పైడిపర్రు, తదితర ప్రాంతాల్లో పర్యటించి ఇంటి నుంచి నడవలేని 9 మంది వృద్ధులకు వైద్యపరీక్షలు, జనరల్ వైద్య పరీక్షలు నిర్వహించి తగు ఆరోగ్య సూచనలు, సలహాలు అందించారు. అసోసియేషన్ సభ్యులు వేల్పూరునకు చెందిన పుట్టా వెంకట చక్రధరరావు ఆర్థిక సాయంతో ఉచితంగా మందులు పంపిణీ చేసినట్లు తెలిపారు. అసోయేషన్ కార్యదర్శి కేవీ సత్యనారయణ, కోశాధికారి ఆర్జి భాస్కరరావు, సభ్యులు గిరిజాల నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

27న మార్కెట్ పన్ను వసూళ్ల వేలం

నరసాపురం: 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి మున్సిపాలిటీలో డైలీ మార్కెట్ పన్ను వసూళ్లపై హక్కులు కల్పించేందుకు ఈ నెల 27న బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్టు మున్సిపల్ కమిషనర్ కె.వెంకటేశ్వరరావు చెప్పారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. ఉదయం 11 గంటలకు పాట నిర్వహిస్తామని పేర్కొన్నారు. పాటదారులు సిండికేట్ కావడంతో ఇప్పటికే వేలం ఓ దఫా వాయిదా పడడం పాఠకులకు విదితమే.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

భీమవరం: భీమవరం టూటౌన్ పరిధిలోని కాత్రేనిగుంటకు చెందిన షేక్ అల్తాఫ్(27) చికిత్స పొందుతూ మృతి చెందాడని పోలీసులు తెలిపారు. మృతుడు, అతని భార్య విడివిడిగా ఉంటున్నారు. మనస్తాపంతో 22న గడ్డిమందు తాగాడని, చికిత్స నిమిత్తం భీమవరం, తణుకు, ఏలూరు అనంతరం కాకినాడ తరలించారన్నారు. చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడని తెలిపారు.

ఘనంగా మట్టల ఆదివారం



దువ్వ గ్రామంలో ఆకులు, పువ్వులతో ఊరేగింపు నిర్వహించిన క్రైస్తవులు



వేల్పూరులో మట్టల ఆదివారం వేడుకల దృశ్యం

తణుకు టౌన్: ఈస్టర్‌కు ముందు ఆదివారం జరుపుకునే మట్టల ఆదివారం వేడుకలను తణుకు మండలంలోని పలు చర్చిలలో క్రైస్తవులు ఘనంగా నిర్వహించారు. ఆదివారం ఉదయం చర్చిలలో ఆరాధన కార్యక్రమాలకు ముందు వివిధ రకాలధాకులు, పువ్వులు చేతబట్టి గ్రామాల్లోని వీధులలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం చర్చిలలో ఆదివారం ప్రార్థనల్లో పాల్గొన్నారు. తణుకు రూరల్ మండలం వేల్పూరులోని సెయింట్ పాల్స్ చర్చి, దువ్వ గ్రామంలోని రక్షణ సైన్యం, ఇతర చర్చిల ఆధ్వర్యంలో క్రైస్తవ విశ్వాసులు మట్టల ఆదివారం వేడుకలు నిర్వహించారు. దువ్వ రక్షణ సైన్యం చర్చి పాస్టర్ జయానందం, లతా జోషి, సంఘ పెద్దలు కోటి, అశోక్, వరదానం, సీతారామయ్య పాల్గొన్నారు.

క్షయ వ్యాధిపై అవగాహన అవసరం



క్షయవ్యాధి నివారణ ప్రతిజ్ఞ చేస్తున్న వైద్యులు, ఆసుపత్రి సిబ్బంది

నరసాపురం: ఏ మాత్రం అనుమానం ఉన్నా క్షయ వ్యాధి పరీక్షలు చేయించుకోవాలని, క్షయ వ్యాధిపై ప్రజలకు అవగాహన అవసరమని, నరసాపురం ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సుప్రియ అన్నారు. ఆసుపత్రిలో ఆదివారం క్షయ వ్యాధి నివారణా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సుప్రియ మాట్లాడుతూ ఆగకుండా దగ్గు, కఫం ఉండటం, బరువు తగ్గడం వంటి సూచనలు కనిపిస్తే కచ్చితంగా కఫం పరీక్ష చేయించుకోవాలని స్పష్టం చేశారు. ఒకవేళ క్షయ అని నిర్ధారణైతే ఆరు నెలలు మందులు వాడితే క్షయ తగ్గుతుందని చెప్పారు. ఐసీటీసీ మెడికల్ కౌన్సెలర్ జి.జేసుప్రసాద్ మాట్లాడుతూ ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో క్షయవ్యాధి నిర్ధారణ పరీక్షలు ఉచితంగా నిర్వహిస్తారని చెప్పారు. క్షయ వ్యాధిని అంతం చేద్దామని ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు నళిని, ప్రశాంత్, గణేష్ పాల్గొన్నారు.

వేగంగా దానమ్మ ఆలయ నిర్మాణం



ఎస్.ఇల్లిందలపర్రులో నిర్మిస్తున్న దానమ్మ ఆలయం

పెనుమంట్ర: మండలంలోని ఎస్.ఇల్లిందలపర్రు గ్రామంలో కోటిన్నర రూపాయల వ్యయంతో పునర్నిర్మిస్తున్న దానమ్మ ఆలయ నిర్మాణ పనులు వేగంగా సాగుతున్నాయి. నూతన ఆలయ విగ్రహ ప్రతిష్టాపన ఈనెల 28న ఉదయం 8 గంటలకు ఉంటుందని ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యుడు, ఎంపీపీ కర్రి వెంకట నారాయణరెడ్డి ఆదివారం ప్రకటనలో తెలిపారు. 26, 27 తేదీల్లో పలు వైదిక కార్యక్రమాలు నిర్వహించి, 28న నూతన ఆలయ, విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం నిర్వహించి, ఆలయ ఆవరణలో అఖండ అన్నసమారాధన నిర్వహిస్తామని పేర్కొన్నారు.

ఉమా వైద్యనాథేశ్వరస్వామికి జ్యోతిర్లింగార్చన

యలమంచిలి: పెనుమర్రు గ్రామంలోని శ్రీ ఉమా వైద్యనాథేశ్వరస్వామిక కల్యాణోత్సవాలలో భాగంగా ఆదివారం రాత్రి ఆలయ ప్రాంగణంలో సహస్ర జ్యోతిర్లింగార్చన కార్యక్రమం నిర్వహించారు. ఆలయ అర్చకులు బాదంపూడి వరప్రసాద్ శర్మ బ్రహ్మత్వంలో ఉదయం స్వామి వారికి అభిషేకం, అమ్మవారికి కుంకుమ పూజలు చేశారు. సోమవారం గ్రామ బలిహరణ, త్రిశూల స్నానం, వసంతోత్సవం, పుష్పోత్సవం నిర్వహిస్తామని ఈఓ ఎస్.సతీష్‌కుమార్ వివరించారు. కల్యాణోత్సవాలు మంగళవారం రాత్రి నిర్వ హించే అఖండ అన్నసమారాధనతో ముగుస్తాయని ఆలయ నిర్మాత పాతూరి సోమరాజు తెలిపారు.

వేసవిలో రెండు పూటలా మంచినీటి సరఫరా

నరసాపురం: వేసవిలో పట్టణ వాసులకు రెండు పూటలా సమృద్ధి గా మంచినీటి సరఫ రా చేయాలని నిర్ణయించామని మున్సిపల్ చైర్‌పర్సన్ బర్రి శ్రీవెంకటరమణ చెప్పారు. ఆదివారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ ఇప్పటికే మంచినీటి చెరువును పూర్తిస్థాయిలో నింపామన్నారు. కాలువలు కట్టేసే సమయానికి చెరువునిండా నీరు ఉండే విధంగా అధికారులకు ఆదేశాలిచ్చామని చెప్పారు. 14 అడుగులు మేర నీటి నిల్వ ఉంటుందన్నారు. కాలువలు కట్టేసిన తరువాత 60 రోజుల పాటు రెండుపూటలా కుళాయిల ద్వారా నీటి సరఫరా చేయడానికి ఎలాంటి ఇబ్బందులు ఉండవన్నారు. ముఖ్యంగా శివారు ప్రాంతాలకు ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా చేయడానికి ప్రణాళిక సిద్ధం చేశామని చెప్పారు. ఎక్కడైనా పైప్‌లైన్లు లీకేజీలు ఏర్పడినా వెంటనే మరమ్మతులు చేస్తామని స్పష్టం చేశారు.